

కాటా లెక్క తప్పుతోంది

- తూనికలు, కొలతల శాఖలో అవినీతిపర్వం
- అదే అదునుగా తూకాల్లో మోసం
- దగాకు గురవుతున్న ప్రజలు



● పలాస-కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లోని తూనికలు, కొలతల శాఖ కార్యాలయం పరిధిలో 14 మండలాలు ఉన్నాయి. ఇక్కడ అధికారి శ్రీధర్ దర్మకాటా (విద్యుత్ తూకం)లకు సీల్ వేసేందుకు రూ.1.78 లక్షల లంచం తీసుకుంటూ ఈ నెల 22న ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. 445 మంది వ్యాపారుల వద్ద ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లకు సీల్ వేసేందుకు రూ.400 చొప్పున అదనంగా వసూలు చేసినట్టు ఏసీబీ అధికారుల విచారణలో తేలింది.

● ఇచ్ఛాపురానికి చెందిన ఓ వ్యక్తి శనివారం మార్కెట్‌లో రెండు కిలోల మామిడి పండ్లు రూ.వందకు కొనుగోలు చేశాడు. మరో కిరాణా దుకాణానికి సామగ్రి కొనేందుకు వెళ్లి.. అక్కడ వాటిని తూకంగా వేయగా.. కేజీన్నరే వచ్చాయి. దీంతో వెంటనే ఆ మామిడి పండ్లు విక్రయించే వ్యాపారి వద్దకు వెళ్లి తూకం తక్కువ వచ్చాయని నిలదీశాడు. జిల్లాలో చాలామంది వ్యాపారులు ఇదే రీతిన తూకాల్లో వినియోగదారులను మోసగిస్తూనే ఉన్నారు.


వారపు సంతలో విక్రయాలు..

ఇచ్ఛాపురం, మే 24(ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని తూనికలు, కొలతల శాఖలో కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. కాటాలకు సీల్ వేసేందుకుగానూ వ్యాపారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇటీవల పలాస-కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లోని తూనికలు, కొలతల శాఖ అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఇదే మాదిరి జిల్లాలో పలువురు అధికారులు వ్యవహరిస్తున్నారు. తనిఖీల సమయంలోనూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదే అదునుగా వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతూ.. వినియోగదారులను దోచుకుంటున్నారు. జిల్లాలో 65 రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. వాటిలో పెట్రోల్ బంక్‌లు, ఎంఎల్‌ఎస్ పాయింట్లు, బులియన్ మార్కెట్, హోల్‌సేల్, చిల్లర దుకాణాలు, మాల్స్, సిమెంట్, ఇనుప సామగ్రి, కూరగాయల దుకాణాలు ఉన్నాయి. వ్యాపారులు కాటాలు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను ఏడాదికోసారి.. మాన్యువల్స్ కాటాలకు రెండేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలి. కానీ జిల్లాలో ఈ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదన్న విమర్శలున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో లైసెన్స్ పునరుద్ధరణ, రెన్యూవల్స్‌లో భాగంగా రూ.79.77లక్షల రుసుం వసూలైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. 1,240 కేసులు నమోదు చేయగా.. రూ.46 లక్షలు జరిమానా వసూలు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం తూనికలు, కొలతల్లో భారీగా మోసాలు జరుగుతూనే ఉన్నాయి.

● **ట్యాంపరింగ్..**

కొందరు వ్యాపారులు ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లలో ట్యాంపరింగ్ చేసి నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లో ఎక్కువగా మోసం జరుగుతోంది. జిల్లావ్యాప్తంగా వందకు పైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. కొన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ఎలక్ట్రికల్ వేయింగ్ మిషన్లలో ట్యాంపరింగ్ చేస్తున్నారు. లీటరు పెట్రోల్‌కు 100 నుంచి 200 మిల్లీ లీటర్లు (మిగతా 8వ పేజీలో..)

కరోనాపై మళ్లీ అప్రమత్తం



- రిమ్స్‌లో ఎప్పటిలానే నిర్ధారణ పరీక్షలు
- జిల్లాలో ప్రస్తుతానికి కొత్త కేసులు లేవు
- అయినా జాగ్రత్తలు పాటిస్తే మేలు

శ్రీకాకుళం, మే 24(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్.. ఐదేళ్ల కిందట ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెంది.. ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. వ్యాక్సిన్ అందుబాటులోకి రావడం.. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో కొవిడ్ తగ్గుముఖం పట్టింది. మళ్లీ ఇప్పుడు రాష్ట్రంలో ఒకటీ రెండు కేసులు నమోదవడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలో కొత్త కరోనా కేసులు నమోదు కాకపోయినా.. అప్రమత్తం కావాల్సిన అవసరం తలెత్తింది. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ఇప్పటికే కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతానికి కొత్త కేసులు నమోదు కాలేదని, ప్రజలు ఆందోళన చెందొద్దని వైద్యశాఖ అధికారులు ప్రకటించారు. గతంలో కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలు పాటిస్తే చాలని చెబుతున్నారు. ఎప్పటిలానే మాస్కులు ధరించడం, భౌతికదూరం పాటిస్తే కరోనా బారిన పడకుండా ఉండొచ్చు. అనవసర ప్రయాణాలు మానుకోవాలి. శానిటైజర్‌తో తరుచూ చేతులను శుభ్రం చేసుకోవాలి. జనసమూహాల్లో ఎక్కువసేపు ఉండ కూడదు. అనారోగ్య సమస్యలతో ఉన్న వారు, డయాబెటీస్, బీపీ, షుగర్, లివర్, కిడ్నీ వ్యాధులున్నవారు అప్రమత్తంగా ఉండాలి. దగ్గు, జ్వరం, శ్వాసకోస సమస్యలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రందించాలి. వృద్ధులు, చిన్నపిల్లలు మరింత జాగ్రత్త పాటిస్తే చాలు అని వైద్యులు సూచిస్తున్నారు.

భయాందోళన వద్దు

శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇంతవరకు కొవిడ్ కేసులు నమోదు కాలేదు. అపోహలు.. వదంతులు నమ్మొద్దు. ప్రజలు అనవసర ఆందోళన.. భయం చెందొద్దు. ప్రస్తుతానికి అప్రమత్తంగా ఉంటే చాలు. గతంలో మాదిరి వ్యక్తిగత జాగ్రత్తలు, జనసమూహంలో వెళ్లేటప్పుడు మాస్కులు ధరిస్తే మంచిది.

-డా.కె.అనిత,
జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి

పిడుగుపాటుకు గురై యువకుడి మృతి

● పెద్దకేశినాయుడుపేటలో విషాదం


శివాజీ (ఫైల్)
శివాజీ మృతదేహం

సంతబొమ్మాళి, మే 24(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం పెద్దకేశినాయుడుపేటకు చెందిన మొర్ఫి లక్ష్మీపతి అలియాస్ శివాజీ(26) శనివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందారు. పోర్టు కాంట్రాక్టర్ వద్ద మట్టి పనులకు సంబంధించి శివాజీ హెల్పర్‌గా పనిచేస్తున్నారు. శనివారం టెక్కలి సమీపంలో పోర్టు రహదారి పనులు చేస్తుండగా, పిడుగు పడింది. దీంతో శివాజీ స్పృహ కోల్పోగా.. కుటుంబ సభ్యులు వెంటనే టెక్కలిలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడు మృతి చెందడంతో ఇక తమకు దిక్కెవరంటూ తల్లిదండ్రులు వెంకటరావు, నారాయణమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

'ఏకలవ్య'లో ప్రవేశాలకు దరఖాస్తులు

మెళియాపుట్టి, మే 24(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలోని ఏకలవ్య పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తెలిపారు. ఎంపీసీలో బాలికలు- 3, బాలురు -3, బైపీసీలో బాలురు - 5, హెచ్‌ఈసీలో బాలురు -15, బాలికలు -15 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.


మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ జీఎమ్ వెంకటరమణ

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

● జీఎమ్ వెంకటరమణ

7లో

గురువుల్లో గందరగోళం

- ప్రిఫరెన్షియల్ ఉపాధ్యాయులకు సింగిల్ పోస్టు నో చాన్స్
- పాయింట్ల కేటాయింపుల్లో అస్పష్టత
- ముగిసిన గేడ్ర్-2 హెచ్‌ఎం, ఎస్‌ఏల బదిలీల దరఖాస్తుల ప్రక్రియ

● నరసన్నపేట మండలం బాడాం ఉన్నత పాఠశాలలో గణితం ఎస్‌ఏగా లుకలాపు నర్సింహమూర్తి పనిచేస్తున్నారు. ఈయన రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. 70 శాతానికిపైగా శారీరక వైకల్యం ఉంది. ఆ పాఠశాలలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేశారు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియ నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్నారు. కాగా.. ఈయనకు ప్రిఫరెన్షియల్ ఉన్నప్పటికీ.. సింగిల్ ఉపాధ్యాయ పోస్టు ఉన్న దగ్గర బదిలీపై వెళ్లేందుకు అవకాశం లేదు. పోనీ రెండు పోస్టులు ఉన్న ఉన్నత పాఠశాలలకు వెళ్దామన్నా.. సర్దుబాటులో చాలాచోట్ల ఎస్‌ఏలు పోస్టులు సర్‌ప్లస్ మిగిలిపోయాయి. సింగల్ పోస్టు ఉన్న దగ్గర ఖాళీ ఉన్నా.. అవకాశం లేకపోవడంతో సూదూరం వెళ్లక తప్పడం లేదని నర్సింహమూర్తి ఆవేదన చెందుతున్నారు.


నరసన్నపేటలో బదిలీల దరఖాస్తులను ఎంఈవోకు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట, మే 24(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల పక్రియ సందడి మొదలైంది. తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులతో మండల విద్యాశాఖ కార్యాలయాల్లో సందడి కనిపిస్తోంది. గ్రేడ్-2 హెచ్‌ఎంలు, ఏస్‌ఏలు బదిలీలకు శనివారంతో దరఖాస్తు గడువు ముగిసింది. జిల్లాలో గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులు 80 వరకు ఖాళీగా ఉండగా, సుమారు 200 మంది బదిలీలకు దరఖాస్తు చేశారు. అలాగే సుమారు 800 మందికి పైగా వివిధ సబ్జెక్టులకు చెందిన ఎస్‌ఏలు దరఖాస్తు చేసుకున్నారు. కాగా దరఖాస్తుల సమయంలో లభించే పాయింట్లలో స్పష్టత లేకపోవడంతో ఉపాధ్యాయులు గుర్రుమంటున్నారు.

● హేతుబద్ధీకరణ(రేషలైజేషన్)కు గురైన ఉపాధ్యాయులకు పాత పాఠశాల పాయింట్లు రావాల్సి ఉంది. అయితే వారికి పాతస్టేషన్ పాయింట్లు రావడం లేదు.

● 2017లో బదిలీ అయినా.. మళ్లీ ఈఏడాది తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని జీవో జారీ చేశారు. అయితే వీరికి 8 ఏళ్లకు చెందిన స్టేషన్ పాయింట్లు రావడం లేదు. వీరికి ఏడాది మూడు పాయింట్లు చొప్పున 24 రావాల్సి ఉండగా, 23.5 రావడంతో ఉపాధ్యాయులు అసహనం చెందుతున్నారు.

● ప్రిఫరెన్షియల్ కేటగిరిలో బదిలీపై వెళ్లే వారిలో చాలామంది ఉపాధ్యాయులకు కష్టాలు తప్పడం లేదు. కేటగిరి 3,4 పోస్టుల్లో ప్రిఫరెన్షియల్ ఉపాధ్యాయులకు 50శాతం పోస్టులు ఖాళీగా ఉన్న దగ్గరకు బదిలీకు అవకాశం ఇచ్చారు. అలాగే ఎస్టీటీలకు అయితే మూడో పోస్టు ఉన్న దగ్గర మాత్రం అవకాశం ఇచ్చారు. కాగా.. జిల్లాలో ఎస్జీటీ మూడో పోస్టు ఉన్న పాఠశాలలు చాలా తక్కువ. దీంతో కొంతమంది ఈ కేటగిరి కూడా వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

● 2023లో పదోన్నతి మీద వెళ్లిన ఎస్‌ఏలు ప్రస్తుతం రేషన్‌లైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులకు పాత స్టేషన్ రాక గగ్గోలు చెందుతున్నారు.

సజావుగా చేపట్టాలి

ఉపాధ్యాయులు బదిలీల పక్రియ ఎటువంటి గందోరగోళానికి గురికాకుండా సజావుగా చేపట్టాలి. ఇరవై రోజులు పాటు చేపట్టాలిన తంతును వారం రోజుల్లో హడావుడిగా ముగిస్తున్నారు. ప్రిఫరెన్షియల్ కేటగిరి వారికి రెండో పోస్టు, మూడో పోస్టు ఉన్న వద్ద కేటాయించడం తగదు. జిల్లాలో రెండో, మూడో పోస్టులు ఉన్న పాఠశాలలు చాలా తక్కువ. వారికి అన్యాయం జరుగుతోంది.

- బమ్మిడి శ్రీరామ్మూర్తి,
యూటీఎఫ్, ప్రధాన కార్యదర్శి


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

మావోయిస్టులతో చర్చించాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో పౌరసంఘాల డిమాండ్

శ్రీకాకుళం, మే 24(ఆంధ్రజ్యోతి): సీపీఐ(మావోయిస్టు పార్టీ)తో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని పౌరసంఘాల నేతలు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ఏపీఎన్జీవో భవన్‌లో శనివారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ, సీపీఎం, సీపీఐ లిబరేషన్, సీపీఐ జనశక్తి, ప్రగతిశీల మహిళా శక్తి సంఘం.. ఇలా పలు ప్రజాసంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి వివిధ తీర్మానాలు చేశారు. ప్రజా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ 'సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ నంబాల కేశవరావుతోసహా అనేక మందిని మోదీ ప్రభుత్వం హత్య చేసింది. ఇది ఫాసిస్టు చర్య. మృత దేహాలను వారి బంధువులకు అప్పగించాలని కోరుతూ శాంతి చర్చలకు సిద్ధమైన మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి. కేశవరావుతో సహా మృతుల భౌతికకాయాలను వారి బంధువులకు అప్పగించాలి. నారాయణపూర్ మారణకాండతో సహా అడవుల్లో సాగిస్తున్న మారణ హోమంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయాలి. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి' అని డిమాండ్ చేశారు. బూటకపు ఎదురు కాల్పుల పేరిట జరిగే మారణకాండపై నిరసన వ్యక్తం చేసే ప్రజాస్వామిక హక్కును కాలరాస్తున్న కూటమి ప్రభుత్వానిది నిరంకుశ విధానమని ఆరోపించారు. ఖనిజ సంపదలు, ప్రకృతి వనరులతో కూడిన అడవులను బడా కార్పొరేటర్లకు అప్పగించే ఆపరేషన్‌కు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాస్వామ్య ఉద్యమానికి సంఘీభావం ప్రకటిస్తున్నట్టు వెల్లడించారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్, జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి దుప్పల గోవిందరావు, లిబరేషన్ జిల్లా నాయకులు రామారావు, గురవయ్య, ఎం.లక్ష్మి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథరావు, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ సభ్యుడు కోదండం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- మాదకద్రవ్యాల నియంత్రణపై దృష్టి
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి


టెక్కలిలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ శ్రీకాంత్‌రెడ్డి

ఇచ్ఛాపురం/ టెక్కలి, మే 24(ఆంధ్రజ్యోతి): మద్యం, గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఇచ్ఛాపురంలోని పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావుతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చెక్‌పోస్టులో సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలించారు. ఆంధ్రా-ఒడిశా నుంచి రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేశారు. సారా, గంజాయి, ఒడిశా మద్యం అక్రమ రవాణా కాకుండా అడ్డుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో సారా నియంత్రణ కోసం సంయుక్త దాడులకుగానూ బరంపురం కార్యాలయంలో గంజాం జిల్లా ఎస్పీతో చర్చించారు.

సారా విక్రయిస్తే.. బైండోవర్..

'సారా కేసుల్లో గతంలో అరెస్టు కానివారిని వెంటనే అరెస్టు చేయాలి. అరెస్టయిన వారికి తహసీల్దార్ కార్యాలయాల్లో బైండోవర్ చేయాలి. బైండోవర్ అయిన నిందితులు నిబంధనలు అతిక్రమిస్తే రూ.2లక్షల అపరాధ రుసుం వసూలు చేయాల'ని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. టెక్కలిలోని ఎక్సైజ్‌శాఖ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. సారా రహిత గ్రామాలు తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తున్న వారికిని కూడా అరెస్టు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి, ఇచ్ఛాపురం సీఐలు ఎస్‌కే మీరాసాహెబ్, జీవీ రమణ, ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్, ఏఈ ఎస్.గోపాలకృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామం ఆర్థికంగా బలోపేతం కావాలి

- లక్ష్యాలను అధిగమించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

7లో









ఏపీ ప్రభుత్వంపై కనీస మర్యాద కూడా లేని

తెలుగు చిత్ర పరిశ్రమ



- రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినందుకు పవన్ కృతజ్ఞతలు
- ఇకపై వ్యక్తిగత చర్చలు ఉండవు.. సినిమా సంఘాల ప్రతినిధులు రావాల్సిందే
- థియేటర్ల బంద్‌పై ఘాటుగా స్పందించిన ఏపీ డిప్యూటీ సీఎం కార్యాలయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు సినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి, అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే - తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఏపీ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా సీఎం చంద్రబాబును తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారైనా మర్యాద పూర్వకంగా కలిశారా? అని ఆయన ప్రశ్నించారు. తెలుగు చిత్ర పరిశ్రమను, అగ్రనటులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించుకొని ఇబ్బంది పెట్టిందో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆరిస్ట్ అసోసియేషన్ లాంటి సంఘాలు మరచిపోయి నట్లున్నాయని ఆయన గుర్తు చేశారు. పరిశ్రమ ఇచ్చిన రిటన్ గిఫ్ట్‌ను తను తగిన విధంగానే స్వీకరిస్తున్నాని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ రిటర్న్ గిఫ్ట్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. జూన్ ఒకటినుంచి థియేటర్ల బంద్ లేదని ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు వెల్లడించిన కొద్ది గంటలకే పవన్‌కల్యాణ్ ఈ ప్రకటన విడుదల చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఆ ఇబ్బందుల్ని మరచిపోయారా?

"రూ.కోట్ల రూపాయల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్ని విధాలా ప్రోత్సహం ఇవ్వడంతో పాటు సృజనాత్మకత ముడిపడిన ఈ వ్యాపారంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకూడదని కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు కూడా స్పష్టంగా చెప్పాయి. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది, కక్ష సాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో తహసీల్దార్లను థియేటర్ల దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా..? ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చెప్పిన విధంగానే, కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందిన వారి చిత్రం విడుదలైనప్పుడు ఏపీ ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించింది. వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డ వారు ఇబ్బందిపడకూడదు అనేది కూటమి ప్రభుత్వం విధానం. తెలుగు సినిమా రంగం వారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి, టిక్కెట్ ధర పెంచమని కోరడం ఎందుకు..? అందరూ కలిసి వచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని పవన్ కల్యాణ్ సూచించారు. దిల్‌రాజు, అల్లు అరవింద్, సురేశ్ బాబు, సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని కూడా తెలిపారు. అయినప్పటికి ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది" ఏపీ డిప్యూటీ సీఎం కార్యాలయం పేర్కొంది.

సినిమా రంగం కోసం ప్రత్యేక పాలసీ..

ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తారు. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పర్యటక రంగానికి పరిశ్రమ హోదా ఇస్తూ పాలసీని ప్రకటించింది. అదే విధంగా సినిమా రంగం అభివృద్ధి కోసం ప్రత్యేక పాలసీ తీసుకురావాలని పవన్ ఆలోచన చేశారు. దీనిపై సీఎంతో చర్చించనున్నారు. అనంతరం కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీని ప్రకటిస్తారు.

థియేటర్ల ఆదాయంపై ఆరా

పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో సంబంధిత శాఖలతో సినిమా రంగం అభివృద్ధిపై ఇప్పటికే కొన్ని చర్చలు చేశారు. ఇందులో పంపిణీదారులు, ఎగ్జిబిటర్లు ఒక గ్రూపుగా ఏర్పడి చేస్తున్న వ్యవహారాలతో పాటు ప్రేక్షకులు వెచ్చిస్తున్న మొత్తాలు, అందుకు అనుగుణంగా వారు పొందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి. తదితర అంశాలను చర్చించారు. థియేటర్లను సంబంధిత యజమానులు నడపటం లేదని, లీజుదారుల చేతిలోనే అత్యధికంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే లీజుదారుల నుంచి పన్ను సక్రమంగా వస్తుందా లేదా...? కొన్ని చిత్రాలకు టిక్కెటు ధరలు పెంచినప్పుడు ఆ మేరకు పన్ను ఆదాయం పెరిగిందా..? లేదా..? అని కూడా పన్నుల విభాగం పరిశీలన చేయాలని దిశానిర్దేశం చేశారు. రాయలసీమ జిల్లాల్లో థియేటర్ల నుంచి వచ్చే ఆదాయంపైన ఈ సందర్భంగా చర్చించారు. టికెట్ సేల్‌కి, వచ్చే పన్నుకి అంతరం ఏ మేరకు ఉందో చూడాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో మల్టీప్లెక్సులు ఎన్ని ఉన్నాయి..?

రాష్ట్రంలో మల్టీప్లెక్సు స్థాయి సినిమా హాల్స్ ఎన్ని ఉన్నాయో తెలియచేయాలని ఇప్పటికే సినిమాటోగ్రఫీ శాఖ అధికారులను ప్రభుత్వం నివేదిక అడిగింది. కొన్ని పట్టణాల్లో సింగిల్ థియేటర్లను కూడా రెండు, మూడు స్క్రీన్స్‌గా విభజించి మల్టీప్లెక్సు విధానంలో నడుపుతున్నారు. వాటిలో టికెట్ ధరలు, సింగిల్ థియేటర్ టికెట్ ధరలకు ఏమైనా వ్యత్యాసం ఉందా..? కౌంటర్‌లో ఏ ధరకు అమ్ముతున్నారో ఆరా తీస్తున్నారు. విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, కాకినాడ, తిరుపతి తదితర నగరాల్లో ఉన్న మల్టీపెక్స్‌ల నిర్వహణ వాటిలోని టికెట్ ధరలు, ఆహార పదార్థాల ధరలపై కూడా దృష్టిసారిస్తారు.

నైపుణ్యాల పెంపుతోనే పరిశ్రమగా అభివృద్ధి...

కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీ ద్వారా రాష్ట్రంలో సినిమా రూపకల్పన నుంచి వాణిజ్యం వరకూ 24 విభాగాల్లో నైపుణ్యాలు పెంపుదల, అధునాతన సాంకేతిక వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. పరిశ్రమహోదా కల్పించడంతో పాటు యువతలోనూ, ఇప్పటికే చిత్ర రంగంలో ఉన్న వారికి ఎప్పటికప్పుడు నైపుణ్యాల అభివృద్ధి కోసం - అవసరమైన శిబిరాలు, సెమినార్లు, సింపోజియమ్స్ లాంటివి ఆంధ్రప్రదేశ్‌లో విరివిగా నిర్వహిస్తారు. సినిమా రంగంలో స్టూడియో నుంచి సినిమా హాల్ వరకూ ఉండే విభాగాల్లో గుత్తాధిపత్యం కంటే ఎక్కువ మందికి అవకాశాలు కల్పిస్తేనే, పెట్టుబడులు పెరిగి పరిశ్రమగా వృద్ధి చెందుతుంది. ఈ దిశగానే పవన్ కల్యాణ్ ఆలోచన చేశారు. కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ పాలసీ ద్వారా ఏపీలో సినిమా రంగం అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.

అమరావతి, (ఆంధ్రజ్యోతి)

సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి దుర్గేష్

సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు మూసివేయాలన్న ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల నిర్ణయంపై ఆరా తీస్తున్నామన్నారు. సినీరంగ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్య అనుకూల వాతావరణం ఉందన్నారు. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసమే నూతన ఫిల్మ్ పాలసీ తెస్తున్నామన్నారు. చిత్ర పరిశ్రమకు, ఎగ్జిబిటర్లకు డిస్ట్రిబ్యూటర్లకు, ప్రొడ్యూసర్‌లకు ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకునేందుకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో విచారణ చేపడుతున్నామన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సినీపరిశ్రమకు చెందిన వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను ఆరా తీసి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారని చెప్పారు. 'హరిహర వీరమల్లు' సినిమా విడుదలకు ముందు ఈ తరహా వ్యవహారం దేనికి సంకేతమని మంత్రి ప్రశ్నించారు.

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)

ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై, చిత్ర పరిశ్రమలోని పరిస్థితులపై నిర్మాతలు బన్నీవాసు, నాగవంశీ స్పందించారు. "సినీ ఇండస్ట్రీలో రాజకీయాలు చాలా సైలెంట్‌గా.. లోతుగా ఉంటాయి. ఈ రాజకీయాల్లో పరిశ్రమ నలిగిపోతోందనే వాస్తవాన్ని ఇప్పటికైనా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు గ్రహించాలి. సినిమాల నుంచే వెళ్లి, డిప్యూటీ సీఎం అయిన వారికే మనం ఆగ్రహం తెప్పించామంటే.. మన ఐకమత్యాన్ని ప్రశ్నించుకోవాల్సిన సమయమిది"

\- బన్నీవాసు

"పెద్ద సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో.. అనవసరం లేని సమస్యలను సృష్టించారు. ఇప్పుడు అవే పెరిగి పెద్దవయ్యాయి. విచక్షణతో ఆలోచించి ఉంటే పరిస్థితి దాకా వచ్చేది కాదు.. ఇలాంటి సమస్యలూ వచ్చేవి కావు"

\- నాగవంశీ

థియేటర్ల బంద్ లేదు

- సమస్యల పరిష్కారానికి కమిటీ



'ఏదో ఒక సినిమాను టార్గెట్ చేసి, థియేటర్లను బంద్ చేస్తున్నారు అనే ప్రచారాన్ని ఖండిస్తున్నాం. జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ లేదు. ఈ విషయంపై అవసరం వస్తే ప్రభుత్వంతో సైతం చర్చిస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలో సింగిల్ స్క్రీన్‌ల బంద్ అంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఆయన స్పష్టతనిచ్చారు. థియేటర్ల బంద్ అంశంపై కొన్ని రోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. వీరంతా ఫిల్మ్ ఛాంబర్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడిగా సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ 'జూన్ 1 నుంచి థియేటర్ల బంద్ జరగడం లేదు. ఈ నెల 30న ఈసీ మీటింగ్ ఉంటుంది. ఆ రోజు మూడు విభాగాల సభ్యులతో కమిటీ వేయబోతున్నాం. తద్వారా ఈ సమస్యకు నిర్ణీత సమయంలో పరిష్కారం వచ్చే అవకాశం ఉంది. చిత్ర పరిశ్రమ కష్టాలను బయట వారెవ్వరూ తీర్చరు. స్వయంగా పరిశ్రమే అందులో నుంచి బయటపడుతుంది' అని చెప్పారు.

మంచి మాస్ రోల్ చేశాను

బెల్లంకొండ సాయి శ్రీనివాస్



"నన్ను ఇష్టపడే ప్రతి ప్రేక్షకుడి కోసం 'భైరవం' చిత్రం చేశాను. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ బలమైన మాస్ పాత్రని చేశాను. మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. వంద శాతం వినోదాన్ని పంచుతుంది. తప్పకుండా అందరికీ నచ్చుతుంది" అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహించిన చిత్రమిది. కేకే రాధామోహన్ నిర్మించారు. ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ మీడియాతో ముచ్చటించారు.

● 'భైరవం' చిత్రంలో పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. ఈ సినిమాలో హీరో కొలిచేది కాలభైరవుణ్ణి. అలా కథలో నుంచే 'భైరవం' టైటిల్ వచ్చింది. సరికొత్త అంశాలతో వినూత్న కథాంశంతో సాగుతుంది. గ్రామీణ నేపథ్యంలో మాస్ అంశాలతో ఓ సినిమా చేయాలనుకుంటున్న తరుణంలో 'భైరవం' కథ నా దగ్గరకు వచ్చింది. నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. పల్లె వాతావరణంలో రూపొందిన ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. దర్శకుడు విజయ్‌తో పని చేయడం మంచి అనుభవం. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు పలు మార్పులు చేసి సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన మార్క్ బలంగా కనిపిస్తుంది. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. ముఖ్యంగా పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్. సినిమా చూశాక విజయ్ కథకు తన పరిధిలో పరిపూర్ణంగా న్యాయం చేశారనే ఫీలింగ్ కలిగింది. వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి.

● నారా రోహిత్, మంచు మనోజ్ పాత్రలు కథలో చాలా కీలకం. అందరికీ గుర్తుండిపోయేలా వారి పాత్రలను దర్శకుడు తీర్చిదిద్దారు. డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రల్లో వారిద్దరూ అలరిస్తారు. అదితీ శంకర్ వెరీ నైస్ పర్సన్. నటనలో తనదైన శైలీ, హావభావాలతో మెప్పిస్తుంది. అలాగే తను మంచి సింగర్, డాన్సర్ కూడా. ఈ సినిమాతో ఆమె ప్రతిభకు తగ్గ గుర్తింపు దక్కుతుంది. శ్రీచరణ్ పాకాల అద్భుతమైన సంగీతం ఇచ్చారు. పాటలకు మంచి స్పందన లభిస్తోంది. రాధామోహన్ గారు నాకు చాలా ఇష్టమైన ప్రొడ్యూసర్. హీరోగా నాకు చక్కటి సంతృప్తిని మిగిల్చే సినిమా ఇచ్చారు. ప్రస్తుతం 'హైందవ', 'టైసన్ నాయుడు', 'కిష్కింధపురి' చిత్రాలు చేస్తున్నాను.

ఎమ్మెల్యే జయకృష్ణకు అభినందన


ఎమ్మెల్యేను సత్కరిస్తున్న దృశ్యం

బూర్జ, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ట్రైబుల్ వెల్ఫేర్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా నియమితులైన పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం కలుసుకుని అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయంలో కలుసుకొని దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం జనసైనికుల సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ బలోపేతం కోసం చేస్తున్న కృషిలో సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లా సంయుక్త కార్యదర్శి జానీతో పాటు పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

1న ఉచిత మోడల్ లాసెట్ పరీక్ష

గుంటూరు(తూర్పు), మే 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన రాష్ట్రస్థాయి ఉచిత మోడల్ లాసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్కా శీనయ్య, కార్యదర్శి నక్కల నాగరాజు యాదవ్, కన్వీనర్ రవి తెలిపారు. గుంటూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు. తిరుపతి, అనంతపురంలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా పరీక్ష నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు కోసం ఆయా జిల్లాల అభ్యర్థులు గుంటూరు- 82974 83785, నెల్లూరు- 99898 50670, తిరుపతి- 94408 10266, అనంతపురం- 94418 88834, శ్రీకాకుళం- 96407 80728 అనే నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

28 నుంచి స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 28వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో క్యాప్, బీఎస్జీ, ఎన్ఎస్ఎస్ స్పోర్ట్స్, తదితర స్పెషల్ కేటగిరీకి సంబంధించిన ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

స్కామ్‌లతో రాష్ట్రాన్ని వైసీపీ కొల్లగొట్టింది


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ

ఆమదాలవలస, మే 24(ఆంధ్రజ్యోతి): తన ఐదేళ్ల పాలనలో వైసీపీ స్కామ్‌లతో రాష్ట్రాన్ని కొల్లగొట్టిందని, తద్వారా రాష్ట్రం సుమారు 25 ఏళ్లు వెనక్కి వెళ్లిందని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో శివ్వాల ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అరాచక అవినీతి పాలనను మరిచిపోయి నియోజకవర్గం ఆ పార్టీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ కూటమి ప్రభుత్వంపై, టీడీపీ నాయకులపై చౌకబారు ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 48 వేల సభ్యత్వాలతో ఉన్న తెలుగుదేశం పార్టీ సమావేశాలకు, ఇతర వ్యక్తులను తెచ్చుకోవాల్సిన అవసరం లేదని, దీనిని వైసీపీ నాయకులు గ్రహించాలన్నారు. రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి బోర గోవిందరావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు మాట్లాడుతూ.. ఆమదాలవలస నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చకు టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. టీడీపీ నాయకులు బీవీ రమణమూర్తి, తంగి గురయ్య, ఇంజరాపు విశ్వనాథం, మీసాల రామారావు, కందుల వెంకటరావు, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో క్రికెట్ బుకీలు?

శ్రీకాకుళం క్రైం, మే 24(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ సీజన్ వచ్చిందంటే క్రికెట్ అభిమానులతో పాటు, బుకీలకు సందడే సందడి. జిల్లాలో మ్యాచ్ మ్యాచ్‌కు, బంతి బంతికీ, ప్రతీ ఓవరకు బెట్టింగ్‌లు జోరుగా సాగుతుంటాయి. జిల్లాలో జోరుగా క్రికెట్ బెట్టింగ్ జరుగుతోందనే సమాచారంతో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బెట్టింగ్‌రాయుళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, తన టాస్క్‌ఫోర్స్ టీమ్‌తో నిఘా ఏర్పాటు చేశారు. దీంతో బెట్టింగ్‌రాయుళ్ల గుండెల్లో గుబులు మొదలైంది. శుక్రవారం అర్ధరాత్రి శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగి గ్రామానికి చెందిన ఓ యువకుడు, అలాగే ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామానికి చెందిన మరోవ్యక్తి, అతని అనుచరుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకుని ఒకటో పట్టణ సర్కిల్ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే జిల్లాలో మరికొంతమంది ఈ బెట్టింగ్ మాఫియాలో బుకీలుగా ఉన్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ టీమ్ ఆ దిశగా దర్యాప్తు చేస్తోంది. ఈ దర్యాప్తులో మరికొంతమంది బుకీలను అరెస్టు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

డిపోల వద్ద ధరల పట్టిక తప్పనిసరి

నందిగాం, మే 24(ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోల వద్ద ధరలు పట్టిక, స్టాక్‌బోర్డు వివరాలు తప్పని సరిగా ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. శనివారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్, నామినీ పేర్లు, ఆథరైజేషన్ నెంబరు ఉండాలని, ఒకటి నుంచి ఐదో తేదీలోగా సరుకులు పంపిణీ పూర్తి చేయాలన్నారు. సీఎస్ డీటీ అనిల్‌కుమార్, డీటీ రామారావు ఉన్నారు.

ప్రతీ గ్రామం ఆర్థికంగా బలోపేతం కావాలి

- సమన్వయంతో లక్ష్యాలను అధిగమించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ గ్రామాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రాథమిక రంగాలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను, వనరులను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. తొలుత ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా నిర్దేశించారు. వ్యవసాయం, ఉద్యానం, పాడిపరిశ్రమ, మత్స్య, పౌల్ట్రీ, పట్టు పరిశ్రమ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకుల భాగస్వామ్యంతో గ్రామాల్లో సమగ్ర ఆర్థిక పరిపుష్టి సాధించడం ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. రాబోయే మూడేళ్లలో ఎంపిక చేసిన గ్రామాలను పూర్తిగా పచ్చదనంతో నింపాలని, సాగులో 60శాతం ఉద్యాన పంటలు ఉండేలా ప్రోత్సహించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించేందుకు యాజమాన్య పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంపొందించాలి. భూసార పెంపు సెంటర్ల బలోపేతం, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం, ఫాం పాండ్ల పరిధిలో ఉద్యాన మొక్కలతో కొత్త ఎకో సిస్టమ్ ఏర్పాటుపై దృష్టి సారించాలి. డ్రోన్ల వినియోగం పెంచాలి. తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో సూక్ష్మసాగు పద్ధతులను విస్తరించాలి. మార్క్‌ఫెడ్ సహకారంతో ఎరువులు, మందులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. వివిధ శాఖలు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేయాలి. వ్యవసాయం, ఆరోగ్యం, మార్కెటింగ్, పారిశ్రామిక పెట్టుబడుల పరంగా గ్రామాలు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమావేశంలో సీఈవో లక్ష్మీప్రసన్న, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఉద్యానవనశాఖ ఏడీ ప్రసాదరావు, ఏపీఎంఐపి డీడీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

- మౌలిక వసతులు కల్పించాలి
- జీఎమ్ వెంకటరమణ


సూచనలు చేస్తున్న ఏపీ గృహ నిర్మాణ సంస్థ జీఎమ్ వెంకటరమణ

శ్రీకాకుళం, మే 24(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఏపీ గృహ నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ (అకౌంట్స్ అండ్ ఆడిట్) పి.వెంకటరమణ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పెద్దపాడు, రాగోలు లేఅవుట్స్‌ను సందర్శించారు. ప్రతీ లే అవుట్‌లోను మౌలిక వసతుల స్థితి, నిర్మాణాల నాణ్యతను పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశమై, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అదనపు ఆర్థిక సహాయం అంశంపై పూర్తి విషయాలను వివరించారు. అనంతరం శ్రీకాకుళం పట్టణంలో గల జడ్పీ సమావేశ మందిరంలో గృహనిర్మాణ సంస్థ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతీ లేఅవుట్‌కు సంబంధించిన పురోగతి వివరాలపై ఆరాతీశారు. ఇప్పటికీ ప్రారంభం కాని, మంజూరైన ఇళ్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి బి.నగేష్, ఈఈలు, డీఈలు, సహాయక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు. పర్యటన సందర్భంగా సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు హాజరై స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ఆమదాలవలస మునిసిపాల్టీ పరిధిలో..

ఆమదాలవలస, మే 24(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో గాజులకొల్లివలస, ఆర్అండ్ఆర్ కాలనీల్లో ఉన్న ఎన్‌టీఆర్ కాలనీ లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఏపీ గృహ నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్ (అకౌంట్స్ అండ్ ఆడిట్) పి.వెంకటరమణ సూచించారు. శనివారం ఆయా లేఅవుట్లలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించి కొంతమంది లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ మోహనరావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నతనడకన సాగుతున్న నిర్మాణాలపై ప్రశ్నించారు. పలువురు లబ్ధిదారులు బిల్లులు సక్రమంగా అందించకపోవడంతో నిర్మాణాలు చేపట్టలేకపోతున్నామని ఆయన దృష్టికి సమస్య తీసుకెళ్లారు. ప్రస్తుతం బిల్లుల చెల్లింపులు, మెటీరియల్ సప్లై వేగవంతం చేస్తే నిర్మాణాలు పూర్తిస్థాయిలో వేగంగా చేస్తామని లబ్ధిదారులు చెప్పారు. దీనికి స్పందించిన ప్రత్యేకాధికారి నిర్మాణాలు వేగవంతం చేయాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని హౌసింగ్ ఏఈ మోహనరావుకు సూచించారు. ఈ పరిశీలనలో హౌసింగ్ ఈఈ ఎ.అప్పారావు, హౌసింగ్ ఎఫ్ఏసీ డీఈ డి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వసతులు మెరుగుపడాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


ఆర్టీసీ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గల ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మరుగుదొడ్లు, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలను పరిశీలించిన అనంతరం ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రయాణికుల అవసరాల కోసం మరికొన్ని చోట్ల తాగునీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రయాణికులతో మాట్లాడి బస్ స్టేషన్‌లో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వి జయకుమార్, ఒకటి, రెండో డిపో మేనేజర్లు అమరసింహుడు, కె.రవి శంకర్ శర్మ, సూపర్‌వైజర్లు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, కూటమి నేతలు

కక్ష సాధింపు అనడం సరికాదు

రణస్థలం, మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతుందని వైసీపీ నేతలు పేర్కొనడం సరికాదని డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, మండల టీడీపీ అధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు సంపతిరావు నాగేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, కొత్తకోట అమ్మినాయుడు అన్నారు. ఎచ్చెర్లలో వారు శనివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీలో జరగని అభివృద్ధి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే సారథ్యంలో జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పైడి ముఖలింగం, మెండ రాజారావు, జీరు రామారావు, బోర శ్రీనివాసరావు, ఉంగటి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆమదాలవలస, మే 24(ఆంధ్రజ్యోతి): మానవుని జీవితంలో సంభవించే ప్రతి అనారోగ్య సమస్య కూడా యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మునిసిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. యోగాంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో యోగ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఉద్యోగులు, పట్టణ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల రద్దు హర్షణీయం

నందిగాం/హిరమండలం, మే 24(ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనాలు రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని మండలాల డీలర్లు అన్నారు. ఈ మేరకు శనివారం నందిగాం, హిరమండలం తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్, మంత్రులు మనోహర్, అచ్చెన్నాయుడు తదితర చిత్రపటాలకు పాల అభిషేకం చేశారు.

పాత వంతెనను తొలగిస్తాం

మెళియాపుట్టి, మే 24(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి సమీపంలో ఉన్న మహేంద్రతనయ నదిపై పాత వంతెన తొలగించనున్నామని, దీనికి నిధులు మంజూరు చేస్తామని ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు. పదేళ్ల కిందట పాత వంతెన నదిలో పడిపోవడంతో వర్షాల సమయంలో నదిలో నీటి ప్రవాహంతో కొసమాల గ్రామంలోకి చేరుతోందని స్థానికులు ఫిర్యాదులు చేశారన్నారు.

రేషన్ పంపిణీకి సిద్ధంగా ఉండాలి

నరసన్నపేట, మే 24(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నుంచి రేషన్ పంపిణీని డీలర్లే నిర్వహించాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లోనే లబ్ధిదారులకు రేషన్ అందించాలన్నారు. సీఎస్ డీటీ, డీలర్లు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం


రేష్మ (ఫైల్)

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 24 (ఆంధ్రజ్యోతి): శ్యాంపాలెం (సానివాడ) గ్రామానికి చెందిన దొండపాటి రేష్మ (21) శనివారం మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. దీంతో రెడ్‌క్రాస్ ప్రతినిధులను సంప్రదించారు. మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్స్ పి.సుజాత, పి.సుమతి రేష్మ కళ్ల నుంచి కార్నియాలను సేకరించి, విశాఖలోని ఎల్వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు.

వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు

ఇచ్ఛాపురం, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు, చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి పూర్ణచంద్ర బెహరా అన్నారు. శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులచే దేశనాయకుల జీవిత చరిత్ర పుస్తకాలను చదివించారు అనంతరం గ్రంథలయంలో చిన్నారులకు వివిధ ఆటలు ఆడిపించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు సత్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఆమదాలవలస, మే 24(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని మండల పరిషత్ ఏవో ఎస్.వాసుదేవరావు అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘ సభ్యులతో కలిసి ప్రపంచ పర్యావరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహించి అనంతరం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన జీవన విధానం గడపాలంటే పరిసరాల పరిశుభ్రత మరుగుదొడ్లు వినియోగం, ఘన ద్రవ వ్యర్థాలు వేరు చేసి చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. గ్రామంలో ప్రతి ఇంటిని పరిశుభ్రంగా ఆహ్లాదంగా ఉండేటట్టు చూడాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక సీనియర్ అసిస్టెంట్ వెంటరమణ, స్వచ్ఛభారత్ సభ్యులు, సహాయం సహాయక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉరుములు.. మెరుపులతో వర్షం


టెక్కలి: నర్సింగపల్లి రోడ్డుపై వర్షపు నీరు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం శనివారం సాయంత్రం కురిసింది. ఇచ్ఛాపురం, టెక్కలి, నందిగాం శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. ఉదయం తీవ్రమైన ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు.

– ఇచ్ఛాపురం/ టెక్కలి/ నందిగాం


ఇచ్ఛాపురంలో కురుస్తున్న వర్షం


నందిగాంలో పడుతున్న వర్షం



హైకోర్టు ఆర్డర్‌తో బయలుదేరిన కేశవరావు బంధువులు

టెక్కలి, మే 24(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ ప్రాంతంలో ఈనెల 20న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్ట్ చీఫ్ నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజు మృతదేహాన్ని స్వగ్రామమైన కోటబొమ్మాళి మండలం జీయన్నపేట తీసుకు వచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మృత దేహాన్ని అప్పగించాలని ఆయన తల్లి భారతమ్మ, సోదరుడు ఢిల్లీశ్వరరావు, పౌరహక్కుల సంఘం నేతలు శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు హైకోర్టు ఆర్డర్‌తో మృతదేహం తీసుకు వచ్చేందుకు కేశవరావు బంధువులు, గ్రామస్థులు జగ దల్‌పూర్‌కు బయలుదేరి వెళ్లారు. మూడురోజులు కిందట జీయన్నపేట నుంచి కేశవరావు బంధువులు జగదల్‌పూర్‌కు వెళ్లగా ఇప్పట్లో మృతదేహం ఇవ్వడం సాధ్యపడదని అక్కడి పోలీసులు తెలియజేయడం, తిరిగి రావాలని జిల్లా పోలీసులు సూచిం చడంతో వారంతా తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే. కేశవరావు సోదరుడు ఢిల్లేశ్వరరావు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి నివాసంలో ఉండడంతో పోలీసులు, షాడో బృందం, ఎస్‌ఐ స్థాయి అధికారితో నిఘా పెట్టారు. ఇక కేశవరావు మృతదేహం రాక అనుకున్నట్లు జరిగితే సోమ వారం జీయన్నపేటలో అంత్యక్రియలు నిర్వహణకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన నారాయణరావు

నందిగాం, మే 24(ఆంధ్రజ్యోతి): కొత్తగ్రహారం సమీపంలోని హైవేపై శనివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీ సులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బడగాం పంచాయతీ శారదాపురం గ్రామానికి చెందిన బూరె నారాయణరావు(59) ద్విచక్ర వాహనంపై కొత్తగ్రహారం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు సర్వీసు రహదారి నుంచి యూటర్న్ తీసుకుంటుండగా పలాస నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో నారాయణరావుకు బలమైన గాయాలు కావడంతో స్థానికుల సమాచారం మేరకు హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నారాయణరావు మృతి చెందాడు. భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ జీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు వివాహితులైన కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు దొంగతనాల్లో నలుగురి అరెస్టు

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద, ఎస్‌ఐ సందీప్‌కుమార్

ఎచ్చెర్ల, మే 24(ఆంధ్రజ్యోతి): మండ లంలోని పలు గ్రామా ల్లో వేర్వేరుగా జరిగిన మూడు దొంగతనాల కేసుల్లో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి నట్టు డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో శని వారం నిర్వహించిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. 2021 సంవత్సరం సెప్టెంబరు 21న ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జాతీయ రహదారి పక్కన తాళం వేసి ఉన్న ఓ ఇంటి తాళాలు పగలుగొట్టి బీరువా లో ఉన్న ఒక బంగారం ముక్క, బంగారం గొలుసు, ముత్యాలహారం, శతమానం, వెండి పళ్లెం, వెండి కుందులు, పూజ గదిలోని వెండి సామా న్లు దొంగిలించారు. ఈ కేసుకు సంబంధించి నెల్లూరు జిల్లా వెంకటేశ్వర పురం గాంధీ గిరిజన కాలనీకి చెందిన పేడల నాగరాజు, పేడల గురవ య్యను అరెస్టు చేశారు. వేలిముద్రల ద్వారా వీరిద్దర్నీ గుర్తించి ఎచ్చెర్ల మండలం జరజాం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అరెస్టు చేసి వీరి నుంచి చోరీ గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

● ఈ నెల 15న కింతలి రోడ్డులోని పూడివలస గ్రామానికి సమీపంలోని ధనలక్ష్మి ఎంటర్ ప్రైజెస్ బాణసంచా దుకాణంలోకి ప్రవేశించి టేబుల్ డెస్క్‌లోని రూ.10 వేలు దొంగించారు. అదేవిధంగా ఈ నెల 19న ఎచ్చెర్ల మండలం ముద్దాడలోని అసిరిపోలమ్మ తల్లి గుడిలో త్రిశూలంతో కూడిన వెండి తొడుగు, వెండి కిరీటం, కత్తితో కూడి వెండి చేయి తొడుగు, డమరకంతో కూడి వెండి చేయి తొడుగు, బంగారం పుస్తెలతాడు, అమ్మవారి బంగారు కళ్లను అపహరణ జరిగింది. ఈ ఘటనలకు సంబంధించి ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామానికి చెందిన అల్లు రవికుమార్, లావేరు మండలం బెజ్జిపురం గ్రామానికి చెందిన టొంపల కోమలరావులను పొన్నాడ బ్రిడ్జి వద్ద అరెస్టు చేశారు. ఏఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు, డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించిన ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్, ఏఎస్‌ఐ కె.రమేష్ దేవ్, హెడ్‌కానిస్టేబుల్ జగదీశ్వరరావు, సిబ్బంది దివాకర్, శ్రీనివాసరావు, గణేష్‌లను ఎస్పీ అభినందించారు.

ప్రగడపుట్టుగ శివాలయంలో చోరీ


వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

కవిటి, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రగడపుట్టుగ గ్రామంలోని రామేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం ఆలయానికి వచ్చిన పూజారి తలుపులు తెరిచి ఉండడం గమనించి గ్రామస్థులకు సమాచారాన్ని ఇచ్చాడు. గ్రామస్థులంతా వచ్చి ఆలయంలో పరిశీలన చేయగా దక్షిణంలో ఉన్న తలుపులకున్న గెడను రాయితో విరగొట్టి ఆలయంలోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఉన్నారు. ఆలయంలోని శివుడి పంచలోహ విగ్రహం, వినాయకుడి విగ్రహంతో పాటు ఇత్తడి వస్తువులు దొంగతనం జరిగాయని ఆలయ ధర్మకర్త బి.రాంప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు. ఘటనా స్థలానికి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించామన్నారు.

తామరాపల్లిలో ద్విచక్ర వాహనాలు..

నరసన్నపేట, మే 24(ఆంధ్రజ్యోతి): తామరాపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన కోల రాజు, కోల శాంతారావులకు చెందిన బైక్‌లను ఇంటి ముందుభాగంలో ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కె.కొత్తూరులో చోరీకి యత్నం

టెక్కలి, మే 24(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు గ్రామంలో శనివారం వేకువజామున దొంగలు హల్‌చల్ చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. కె.కొత్తూరు సమీపంలో చోరీకి ప్రయత్నిస్తున్న వ్యక్తులను స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో వారిలో ఒక వ్యక్తి తన వద్దనున్న కత్తిని చూపించి బెదిరించాడు. అయితే గ్రామస్థులు ఆ వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించగా మిగిలిన వారు పరారయ్యారు.

రాష్ట్ర నిర్మాణంలో ఎన్‌ఆర్‌ఐల పాత్ర అభినందనీయం

● పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

● జర్మనీలో ఘనంగా మినీమహానాడు

పలాస, మే 24(ఆంధ్రజ్యోతి): జర్మనీ దేశంలో టీడీపీ మినీమహానాడు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. ప్రవాస భారతీయుల స్ఫూర్తితో 12 లక్షల మంది ఎన్నికల సమయంలో స్వదేశానికి వచ్చి టీడీపీ విజయం కోసం, రాష్ట్ర పున ర్నిర్మాణం కోసం పాటు పడడం అభినందనీయమన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత సీఎం ఎన్టీ ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీఎం చంద్రబాబు సందేశాన్ని చదివి వినిపించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. పుల్వామా అమర వీరులకు నివాళి, సీఎం చంద్రబాబు నాయుడు పీ-4తో ఆంధ్ర రాష్ట్రానికి చేయూత, కూటమి విజయంపై హర్షం, జర్మనీతో పాటు చుట్టు పక్కల దేశాల్లో నివసిస్తున్న తెలుగు వారికి ఆపద సమయాల్లో అందుబాటులో ఉంటామని తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఎంసీ పూర్వ చైర్మన్ మన్నవ సుబ్బా రావు, పలాస నియోజకవర్గం సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి, కుర్రా పవన్, కుదిటిపూడి శ్రీకాంత్, కోనేరు నరేష్, దాసరి వంశీ, సుమంత్, వెంకట్, శివ తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష, నిర్వాహకులు

గ్రామదేవత ఉత్సవాలు ప్రారంభం



ప్రతిష్ఠించిన నూతన విగ్రహం, ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): పల్లిసారధి గ్రామంలో అసిరిపోలమ్మ గ్రామ దేవత ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. 20 ఏళ్ల తరువాత ఉత్సవాలు జరుగు తున్న నేపథ్యంలో గ్రామ స్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఈనెల 27వ తేదీతో ముగుస్తా యని వారు తెలిపారు. గ్రామదేవత అసిరి పోలమ్మ నూతన ఆలయం ప్రారంభం, విగ్ర హ ప్రతిష్ఠ చేపడుతున్నారు. విగ్రహాన్ని భారీ ఎత్తున ఊరేగించారు. మహిళలు కలశా లతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా పలువురు కళాకారులు కళా రూపాలను ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పల్లిసారధి భిలాయ్ బాలగణపతి సమాజం నుంచి అనుబంధం అనే నాటిక, అండమాన్ నికోబర్ బాలగణపతి సమాజం జాలారి జనపదం, జబర్దస్ ప్రదర్శనలు, డీ ప్రోగ్రాం కళాకారులు పండు, జానీ జోడి నృత్యాలు ఉంటాయన్నారు. 27న సిరిమాను ఉత్సవం భారీగా నిర్వహిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు.

జల్‌జీవన్ నీరేదీ?

● మేజర్ పంచాయతీలో తాగునీటి ఇక్కట్లు

● మండల సమావేశంలో అధికారుల నిలదీత

పాతపట్నం, మే 24(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పాతపట్నంలో రూ.కోట్లతో మంజూరు చేసిన జల్‌జీవన్ మిషన్ నీరు ప్రజలకు అందడం లేదని, దీంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీటీసీ సభ్యుడు కొరకాల ఎండయ్య తదితరులు అధికారులను నిలదీశారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతపట్నంలోని కుమ్మరి వీధి, మొండిగల్ల వీధి, నాగవంశపు వీధి, దువ్వారి వీధి, బ్రాహ్మణ వీధి, కాపువీధుల్లో జల్ జీవన్ సేవలు అందడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇంటింటికీ తాగునీరందించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం రూ.1.92 కోట్ల నిధులు మంజూరు చేసినా ఎక్కడా కుళాయిలు కనిపించడం లేదన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సమాధానమిస్తూ.. ఇప్పటికే పలు వీధుల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా అందించేందుకు ఏర్పాటు చేసినా ట్యాంకులు చాలనందున రూ.48 లక్షలతో కొత్త ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, ఇంటింటికీ తాగునీరందిస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ ప్రదీప్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.చంద్రకుమారి, జడ్పీటీసీ లింగాల ఉషారాణి, తహసీల్దార్ కిరణ్ కుమార్, మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకర రావు తదితరులు పాల్గొన్నారు.


పలాస: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న ఆర్డీవో వెంకటేష్, అధికారులు

యోగా సాధనతో మానసిక వికాసం

పలాస/కాశీబుగ్గ/టెక్కలి/నరసన్నపేట, మే 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'యోగా ఆంధ్ర'లో భాగంగా శనివారం పలాస, టెక్కలి, నరసన్నపేటల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది యోగాభ్యాసం చేశారు. పలాస, టెక్కలిల్లో ఆర్డీవోలు జి.వెంకటేష్, ఎం.కృష్ణమూర్తి యోగాలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు యోగాను దినచర్యగా చేసుకోవాలన్నారు. దీనివల్ల ఆరోగ్యం సిద్ధించడంతోపాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. వైద్యులు ప్రవీణ్‌కుమార్, ఆకుల ప్రకాష్, శివ, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు. అలాగే నరసన్నపేటలో యోగా ఆంధ్ర కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూధనరావు, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి: సబ్ కలెక్టర్ కార్యాలయంలో యోగా శిక్షణలో పాల్గొన్న ఆర్డీవో కృష్ణమూర్తి

పేదల పెన్నిధి.. సీఎంఆర్‌ఎఫ్


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

పోలాకి మే 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదల పాలిట పెన్నిధి అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని పలువురి ఉన్నత చికిత్సల కోసం మంజూరైన సీఎంఆర్ ఎఫ్ చెక్కులను కత్తెరవానిపేటలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందించారు. వెదుళ్ల వలస కు చెందిన అత్తిలి శ్రీనివాసరావుకు బ్రెయిన్ సర్జరీకి రూ.45000, చెల్లాయివలసకు చెందిన ముద్దాడ తవిటినాయుడు కిడ్నీ సర్జరీకి రూ.1,78,750, అంబీరుపేటకి చెందిన మళ్ల వైకుంఠరావు కుడికాలు సర్జరీ కోసం రూ.60 వేలు మంజూరు కాగా ఆ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో బగ్గు అర్చన, పార్టీ మండల అధ్యక్షుడు ఎంవీ నాయుడు, నేతలు బైరి భాస్కర రావు, సూరపు నారాయణదాస్, పంచిరెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

హిరమండలం, మే 24(ఆంధ్రజ్యోతి): సుభలయి మెట్టుతోట వద్ద వంశధార నదీ గర్భంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతుండగా తహసీల్దార్ హనుమంతురావు సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఈ సమయంలో నదిలో ఇసుక లోడ్‌తో ఉన్న మూడు ట్రాక్ట ర్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నది నుంచి ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఆర్‌ఐ శంకరరావు, వీఆర్వోలు, ఏఎస్‌ఐ రమణ పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

● బాధ్యతలు స్వీకరించిన సీఐ శ్రీనివాసరావు


మరడాన శ్రీనివాసరావు

నరసన్నపేట, మే 24(ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సీఐ మరడాన శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐగా ఆయన బాధ్య తలు స్వీకరించారు. ఈయన పార్వతీపురంమన్యం జిల్లా నుంచి బదిలీ పై ఇక్కడికి వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జె.శ్రీనివాసరావు విశాఖపట్నం బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన తరువాతన సీఐ మరడాన శ్రీనివాసరావు మాటాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా ఆయనను నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట ఎస్‌ఐలు ఆయనకు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఓటరు జాబితాల్లో తప్పులను సవరించాలి

నరసన్నపేట, మే 24(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాల్లోని తప్పులను సవరించాలని, ఒక కుటుంబ సభ్యులు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ రోణంకి కృష్ణంనాయుడు, పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి గొద్దు చిట్టిబాబు కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఈఆర్వో లావణ్య ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, టీడీపీ నేత గొలివి రామారావు, తహసీల్దార్లు సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూడిలంక వాసుల స్వప్నం నెరవేరనుంది

వజ్రపుకొత్తూరు, మే 24(ఆంధ్రజ్యోతి): పూడిలంక వంతెన నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసు కోవడంతో దశాబ్దాలుగా గ్రామస్థుల చిరకాల స్వప్నం నెరవేరనుందని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహన రావు అన్నారు. శనివారం గ్రామస్థులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంక గ్రామం వరకు రహదారితో కూడి వంతెన నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ.4 కోట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విడుదల చేశారన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష కృషితో నిధులు విడుదల కావడంతో గ్రామస్థులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఉపా ధ్యక్షుడు అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ తిమ్మల కృష్ణారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చేరిన పుస్తకాలు

పలాసరూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి పాఠ్య పుస్తకాలు 90శాతం వచ్చాయని ఎంఈవో-2 సత్యం తెలిపారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం పుస్తకాలు వచ్చాయన్నారు. ఒడియా మీడియం పుస్తకాలు ఇంకా రాలేదని, త్వరలో అవి వచ్చే అవకాశాలున్నాయన్నారు. పాఠశాలలు తెరుచుకునే సమయానికి పుస్తకాలతో పాటు ప్రభుత్వం అందించే ఇతర సామగ్రి కిట్లను అందజేస్తామన్నారు.

వార్షిక రుణ ప్రణాళికలు పారదర్శకంగా ఉండాలి

మందస, మే 24(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల వార్షిక రుణ ప్రణాళికలు పారదర్శకంగా ఉండాలని డీపీఎం జి.శ్రీధర్ అన్నారు. శనివారం స్థానిక అమ్మవారి ఆలయంలో వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూక్ష్మ రుణ ప్రణాళిక తయారు చేసేటప్పుడు సభ్యుల బయోమెట్రిక్ తీసుకోవాలని, ప్రతినెలా సమావేశం జరిగే ప్రదేశాన్ని జియో ఫెన్సింగ్ చేయించాలన్నారు. సభ్యుల హాజరు కోసం ఫేస్‌ను యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు నీరజ, శారద, నాగమణి, క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

'కాటా' లెక్క తప్పుతోంది

(ఐదో పేజీ తరువాయి)

వరకూ పక్కదారి పట్టిస్తున్నారు. బంకుల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదు. పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించడం లేదు. వాస్తవానికి పెట్రోల్ నాణ్యత తెలుసుకునేందుకు బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంటుంది. ఆ పేపరుపై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే.. అది ఆవిరి అయిపోతే నాణ్యమైనది. మరకలుగా మిగిలితే అది కల్తీ జరిగినట్టు నిర్ధారించవచ్చు. కానీ జిల్లాలో ఏ బంకులోనూ నాణ్యత పరీక్షలు చేయడం లేదు.

● గృహ నిర్మాణ సామగ్రి అమ్మకాల్లో కూడా మోసాలు జరుగుతున్నాయి. 25 కేజీల సిమెంట్ బస్తా వద్ద కేజీ, కేజీన్నర తరుగు వస్తోంది. కంపెనీలు నిబంధనలు పాటిస్తున్నా.. కొంతమంది దళారులు బస్తాల్లో సిమెంట్ తీసి రీ ప్యాకింగ్ చేస్తున్నారు. ఇనుము కేజీ లెక్క విక్రయించాల్సి ఉన్నా, జిల్లాలో చాలామంది వ్యాపారులు విడి పరికరాల కింద అమ్ముతున్నారు. ● వంట గ్యాస్‌లో కూడా మోసం పెరుగుతోంది. కొన్ని ఏజెన్సీల సిబ్బంది ప్రభుత్వం ఇచ్చే ఇన్సెంటివ్ కాకుండా డెలివరీ చార్జీల పేరిట అదనంగా వసూలు చేస్తున్నారు. గ్యాస్ సిలెండర్‌లో కూడా నిర్ణీత ప్రమాణం తగ్గుముఖం పడుతోంది. చాలామంది బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ సిలెండర్లు కొనుగోలు చేసినప్పుడు వ్యత్యాసం కనిపిస్తోంది. ఒక్కో సిలిండర్ వద్ద రెండు కిలోల వరకూ తగ్గుముఖం పడుతోంది. డెలివరీ బాయ్స్ కూడా కొంత అదనపు వసూలుకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ● ఇక నిత్యావసరాలు, ఆహార పదార్థాల గురించి చెప్పనక్కర్లేదు. నాణ్యతలోను, తూనికల్లోనూ మోసమే కనిపిస్తోంది. కిరాణా దుకాణాల నుంచి పెద్ద షాపింగ్ మాల్స్ వరకూ ట్యాంపరింగ్ చేసి విక్రయిస్తున్నారు. కిలో దగ్గర 100 గ్రాముల వరకూ తగ్గించి అమ్ముతున్నారు. కొన్నింటికి ప్రామాణిక ముద్రతో విక్రయించాల్సి ఉన్నా.. ఇష్టారాజ్యంగా లూజు విక్రయాలు చేస్తున్నారు. వంట నూనెలో కూడా కల్తీ జరుగుతోంది. ప్రధానంగా వారపు సంతల్లో తూనిక రాళ్లతో విక్రయిస్తున్నారు. ఏటా ఈ రాళ్లకు రెన్యువల్ చేయాల్సి ఉన్నా, ఎక్కడా అమలుకావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వారపు సంతలే.. మార్కెట్లుగా లక్షలాది రూపాయల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ఆ సంతల్లో తూనిక రాళ్లతో వ్యాపారులు మోసం చేస్తున్నారు. ఇలా అన్నింటా మోసాలు జరుగుతున్నా.. తూనికల కొలతల శాఖ అధికారులు నామమాత్ర తనిఖీలకే పరిమితమవుతున్నారు.

ఫిర్యాదు చేయాలి..

తూనికలు, కొలతలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎక్కడైనా మోసాలు జరిగితే వెంటనే ఫిర్యాదు చేయాలి. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం. వ్యాపార సంస్థలు నిర్ణీత ప్రమాణాలు పాటించాలి. లేదంటే చర్యలు తప్పవు. సిబ్బంది కొరత ఉన్నా ఉన్నంతలో తనిఖీలు చేపడుతున్నాం.

-ఎస్.విశ్వేశ్వరరావు, ఏసీఎల్ఎం, శ్రీకాకుళం

న్యూస్ బాక్స్

ఫాంపాండ్ పనులకు వేతనదారుల నిరాకరణ

నరసన్నపేట, మే 24(ఆంధ్రజ్యోతి): రెడ్డికపేట గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఫాం పాండ్ పనులు చేసేందుకు వేతనదారులు శనివారం నిరాకరించారు. గ్రామశివారులో ఇద్దరు రైతుల పొలాల్లో ఫాంపాండ్స్ తీయాలని క్షేత్రసహాయకుడు సూచించారు. అయితే గ్రామంలోని చెరువులో మాత్రమే పనులు చేస్తామని వేతనదారులు మొండికేశారు. దీనికి క్షేత్రసహాకకుడు అవకాశం ఇవ్వకపోవడంతో పనులు చేయకుండా వెనుదిరిగారు. ఈ విషయమై ఉపాధి ఏపీవో యుగంధర్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ప్రణాళిక ప్రకారం ఫాంపాండ్స్ పనులు చేయాల్సి ఉందని స్పష్టం చేశారు.

ఐతమ్ డైరెక్టర్‌తో కల్నల్ భేటీ

టెక్కలి, మే 24(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో 14వ ఎన్‌సీసీ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ వీకే పండా డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావును శనివారం కలుసుకున్నారు. ఈనెల 31 నుంచి జూన్ 9 వరకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ఎన్‌సీసీ క్యాంపు నిర్వహణపై చర్చించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన క్యాడెట్లకు వసతి, భోజన సదుపాయాలపై చర్చించారు. ఆయనతో పాటు సుబేదార్ జితేంద్రపాల్‌సింగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, మురళీమోహన్, ట్రైనర్ భుజంగరావు తదితరులు ఉన్నారు.

సాగునీటి కాలువల అభివృద్ధి

పలాసరూరల్,మే24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సాగునీటి వనరుల పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని టీడీపీ నాయకులు అన్నారు. లక్ష్మీపురం వద్ద వంశధార ఎడమ కాలువలో గుర్రపు డెక్క పూడికతీత శనివారం చేపట్టారు. ప్రతి చేనుకు నీరు, ప్రతి చేతికి పని ఎమ్మెల్యే శిరీష సంకల్పం మేరకు సాగునీటి వనరులను అభివృద్ధి చేసేందుకు కోటి రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, దువ్వాడ సంతోష్‌రామ్ నాయుడు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు గొనప నిరంజన్, లక్ష్మీపురం, నగరంపల్లిచ కవిటి, అమలకుడియా నీటి సంఘం అధ్యక్షులు శిష్టు మురళి, దువ్వాడ అప్పారావు, దాసరి దాశరథి,వరిశ తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై అవగాహన

పలాస, మే 24(ఆంధ్రజ్యోతి): బాలల రక్షణపై రైలు ప్రయాణికులకు శనివారం రైల్వే పోలీసులు, 1098 చైల్డ్‌లైన్, ఆర్పీఎఫ్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ చైతన్యం చేశారు. రైలు ఎక్కేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, బాలికల అపహరణపై తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ చక్రధర్, హెచ్‌సీ సోమేశ్వరరావు, రైల్వే చైల్డ్ హెల్ప్‌డెస్క్ సూపర్‌వైజర్ బాలసరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సైనిక పాఠశాల పరీక్షల్లో ప్రతిభ


చాణక్యనాయుడు

హిరమండలం, మే 24(ఆంధ్రజ్యోతి): హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి వై.చాణక్య నాయుడు సైనిక పాఠ శాలలో ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 28వ ర్యాంకు సాధించినట్లు హెచ్‌ఎం తూలగాపు కేశవరావు తెలిపారు. పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందుతున్న చాణక్య నాయుడు దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనే లక్ష్యంతో సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్ష రాశాడ న్నారు. ఇప్పటికే చాణక్య నవోదయ ఎం ట్రన్స్‌కు, నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యాడని హెచ్‌ఎం పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థిని అభినందించారు.

తనీష్‌కు 30వ ర్యాంకు


ధమన్ తనీష్

పలాస, మే 24(ఆంధ్రజ్యోతి): ఆలిండి యా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో పలాసకు చెందిన సీపాన ధమన్ తనీష్ 30వ ర్యాంకు సాధించాడు. బాలుడి తండ్రి రాంబాబు స్థానిక ఎస్‌బీఐ మేనేజర్‌గా పని చేస్తున్నారు. తల్లి వనిత గృహిణిగా ఉన్నారు. సైనిక్ స్కూల్‌కు తనీష్ ఎంపికపై ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులు అభినందించారు.

ఆటోలకు క్యూఆర్ కోడ్

హిరమండలం, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలో తిరుగుతున్న అన్ని ఆటోలకు క్యూఆర్ కోడ్ కేటాయించినట్లు ఎస్‌ఐ ఎండీ యాసిన్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అతికించారు. దీని వల్ల ఆటోలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం ఉందన్నారు.

విద్యార్థులకు నీతి కథలు

మందస, మే 24(ఆంధ్రజ్యోతి): మందస శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు నీతికథలను శనివారం వివరించినట్లు గ్రంథాలయాధికారి జె.విజయలక్ష్మి తెలిపారు. ప్రతి రోజు విద్యార్థులకు వివిధ అంశాల్లో అవగాహన కలిగిస్తున్నామన్నారు.